ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
సెప్టెంబరు 10, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

# మహోగ్రరూపం



## నేపాల్‌లో రెండోరోజూ ఆందోళనలు

**రెచ్చిపోయిన విద్యార్థులు, యువత .. 22కు పెరిగిన మరణాలు**

**పార్లమెంట్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు**

**పదవీత్యాగం చేసిన ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ**

**మంటల్లో కాలి చనిపోయిన మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి**

**సరిహద్దు వద్ద పహారాను కట్టుదిట్టంచేసిన భారత్**

**బాలెన్‌ను కొత్త ప్రధానిగా చేయాలన్న ఆందోళనకారులు**

**కర్ఫ్యూలోనూ వీధులను కదనరంగంలా మార్చిన విద్యార్థులు**




కాఠ్మండు/న్యూఢిల్లీ: సోషల్ మీడియా యాప్‌లపై నిషేధంతోపాటు విద్యార్థులు, యువత సోమవారం మొదలెట్టిన ఆందోళనలు మెరుపు వేగంతో నేపాల్‌ను చుట్టేసి దేశాన్ని సంక్షోభ కుంపట్లోకి నెట్టేశాయి. సామాజిక మాధ్యమాల సేవలను పునరుద్ధరిస్తున్నామని కేపీ శర్మ ఓలీ సారథ్యంలోని ప్రభుత్వం కొద్ది గంటల్లోనే స్పష్టంచేసినా అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. రాజధాని కాఠ్మండు మొదలు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, యువత తమ నిరసనజ్వాలలను మరింతగా ఎగదోస్తూ ఏకంగా పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టారు. మంగళవారం ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు, సైన్యం రంగంలోకి దిగాయి. కాళీమతిలో పోలీస్‌సర్కిల్‌కు నిప్పుపెట్టి అధికారులపై దాడి చేయడంతో

(మిగతా 2వ పేజీలో)



## గ్రూప్ 1 జవాబు పత్రాలు
## మళ్లీ దిద్దాల్సిందే!

**గ్రూప్ 1 మెయిన్స్‌పై తేల్చి చెప్పిన హైకోర్టు**

**మార్చిలో ఇచ్చిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు.. తుది మార్కుల జాబితా కూడా..**

**జవాబు పత్రాలు మాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలి**

**ఆ మేరకు ఫలితాలు ప్రకటించి పోస్టులు భర్తీ చేయాలి**

**మూల్యాంకనం సాధ్యం కాకుంటే మళ్లీ మెయిన్స్ పరీక్ష పెట్టండి**

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను మళ్లీ దిద్దాల్సిందేనని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు హైకోర్టు తేల్చిచెప్పింది. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా,

(మిగతా 2వ పేజీలో)

# ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

## ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి దాకా..

**ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ విజయ ప్రస్థానం ఇదీ..**

**జాతీయవాద రాజకీయాలకు ఆదరణలేని తమిళనాట 16వ ఏటనే సంఘ్‌లో చేరిక**

**1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు ఎంపీగా ఘన విజయం**

**2004 నుంచి 2007 వరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా సేవలు**

న్యూఢిల్లీ : ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. మొత్తం 781 మంది పార్లమెంట్ సభ్యులకు గాను 767 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 98.2 శాతం ఓటర్ టర్నౌట్‌ను సూచిస్తుంది. భారత రాష్ట్ర సమితి, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ సభ్యులు ఓటు వేయలేదు. ఉప రాష్ట్రపతి అభ్యర్థులుగా ఎన్డీ యే తరఫున సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టి స్ బి సుదర్శన్ రెడ్డి పోటీ చేశారు. ఉప రాష్ట్రపతి కోటా విజయానికి కావాల్సిన ఓట్లు 377 కాగా, రాధాకృష్ణన్‌కు 452 ఓ ట్లు, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. పోలైన మొ త్తం ఓట్లలో 15 చెల్లనివిగా గుర్తించారు. దీంతో 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు రాజ్యసభ సెక్రటరీ ప్రకటించారు. ఈ విజయం ఆయన రాజకీయ అనుభవాన్ని, ఎన్డీయే కూటమి బలాన్ని ప్రతిబింబించింది. అదే సమయంలో కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు క్రాస్ ఓటింగ్ చేయడం వల్ల ప్రతిపక్ష పార్టీలో చీలికలు ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయి. పార్లమెంట్ నూతన భవనం లోని ఎఫ్ 101 వసుధలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ , సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ

(మిగతా 2వ పేజీలో)



ఆర్ఎస్ఎస్‌లో మొదలైన ప్రస్థానం.. ద్రవిడ గడ్డపై కమలం జెండాను రెపరెపలాడించిన పోరాటం.. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధ పాలనకు అందించిన సహకారం.. వెరసి అంతిమంగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను భారత ఉపరాష్ట్రపతిని చేశాయి. తమిళనాడులోని ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి వరకు సీపీ రాధాకృష్ణన్ సాగించిన సుదీర్ఘ రాజకీయ యాత్ర మంగళవారం విజయతీరాలకు చేరింది.



## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు
## అనుమతి ఇవ్వండి

**రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులకు కూడా...**

**శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలి**

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతులు**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సమావేశం**

న్యూఢిల్లీ: రాష్ట్రంలో రహదారి నెట్‌వర్క్ విస్తరణ, విద్యాభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, నిర్మలా సీతారామన్‌ను మంగళవారం ఆయన వేర్వేరుగా కలిసి ఈ అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. హైదరాబాద్ సమీపంలోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా బందరు ఓడరేవు వరకు 12 వరుసల రహదారి నిర్మించాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ ప్రతిపాదిత మార్గంలో 118 కిలోమీటర్లు తెలంగాణ పరిధిలో ఉంటుందని సీఎం వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) పనులను వేగవంతం చేయాలని కోరారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వెళ్లే మార్గంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా

(మిగతా 2వ పేజీలో)

# పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

**ఆ 10 మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని చెప్పారు**

**స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్ : 'ఆ పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీ లో చేరారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొన్న టీవీల్లో చెప్పారు. ఆయనే అప్రూవర్‌గా మారి.. నేరాంగీకారం తెలిపిన తర్వాత విచారణ ఎందుకు? చర్చ ఎందుకు? వారిపై వేటు వేసేందుకు స్పీకర్‌కు మొహమాటం ఎందుకు?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచ గ్రామానికి వచ్చారు. శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. హరీశ్‌రావు తిరిగి హైదరాబాద్‌కు పయనమైన అనంతరం

(మిగతా 2వ పేజీలో)



# ఫార్ములా ఈ- కారు రేసుపై ఏసీబీ నివేదిక

**కేటీఆర్, అర్వింద్‌కుమార్‌లపై అభియోగం**

హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిధుల బదలాయింపులో తీవ్ర ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయని, హెచ్ఎండీఏ నిధులు దుర్వినియోగం అయ్యాయని అవినీతి నిరోధక శాఖ తేల్చినట్టు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా, సంబంధం లేని విభాగం నుంచి నిధులను ఫార్ములా ఈ- కారు రేసుకు బదిలీ చేయడం వెనుక క్విడ్ ప్రో కో జరిగినట్టు అవినీతి నిరోధక శాఖ

(మిగతా 2వ పేజీలో)


# అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

వరద బాధితులకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా

హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే

హిమాచల్‌కు 1,500 కోట్లు, పంజాబ్‌కు 1,600కోట్లు



# మహోగ్రరూపం

పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు చనిపోయారు. దీంతో కాల్పులు, పరస్పర ఘర్షణ ఘటనల్లో మరణాల సంఖ్య మంగళవారానికి 22కు పెరిగింది. 300 మందికిపైగా గాయపడ్డారు. కట్టలు తెంచుకున్న యువాగ్రహాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ మంగళవారం తన పదవికి రాజీనామాచేశారు. భద్రంగా ఇంటి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను బతిమాలుకున్నట్లు వార్తలొచ్చాయి. ఆందోళనకారుల నిరసన కార్యక్రమం అదుపుతప్పి మాజీ ప్రధానమంత్రి, తాజా మంత్రులపై భౌతికదాడులదాకా వెళ్లింది. ప్రధాని ఓలీకి చెందిన భక్తపూర్‌లోని బాల్కోట్ నివాసాన్ని ఆందోళనకారులు తగులబెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఝలనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో చిక్కుకుని ఆయన భార్య రాజ్యలక్ష్మీ చిత్రకార్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఆమెను సమీప కీర్తిపూర్ బర్న్

**ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె ప్రాణాలు**

కోల్పోయారు. ఎటు చూసినా ఆస్తుల విధ్వంసం, వినాశనంతో నేపాల్ నిలువెల్లా రక్తమోడింది. దుకాణాల లూటీలు, పౌరుల భయాందోళనల నడుమ ప్రధాని రాజీనామాతో ఎట్టకేలకు సైన్యం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి శాంతభద్రతల పరిరక్షణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకుంది. పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకుని ప్రజల ఆస్తులను ధ్వంసంచేస్తూ లూటీలకు తెగించిన వాళ్ల అంతుచూస్తామని ఆర్మీ చీఫ్ హెచ్చరించారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి, రాజకీయ వారసత్వం, సంపన్న, ఉన్నతస్థాయి వర్గాల ఆధిపత్యంపై ఇప్పటికే విసిగిపోయిన యువత తాజాగా సామాజికమాధ్యమాలపై హఠాత్తుక నిషేధం విధించడంతో వాళ్లలో ఆగ్రహం పెల్లుబికి మహోద్యమంగా మారడంతో దేశ భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది.

**పెల్లుబికిన ఆగ్రహం**

పరిస్థితిని మరింతగా కట్టుతప్పొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కర్ఫ్యూను విధించింది. అయినాసరే వేలాదిమంది విద్యార్థులు, యువత 'జెన్ జెడ్'కూటమిగా ఏర్పడి రాజధాని కాఠ్మండు మొదలు పట్టణాలదాకా విధ్వంసానికి తెగించారు. మాజీ ప్రధానమంత్రులు మొదలు తాజా కేబినెట్ మంత్రులు, కీలక నేతల దాకా ముఖ్యమైన వ్యక్తుల ఇళ్లకు నిప్పంటించారు. ప్రధాన రాజకీయ పార్టీల ప్రధాన కార్యాలయాలనూ ధ్వంసంచేశారు. కనిపించిన ప్రతి ఒక్క రాజకీయ నేతను చితకబాదారు. దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్, మాజీ ప్రధాని పుష్పకమల్



దహాల్(ప్రచండ), ప్రస్తుత కమ్యూనికేషన్స్ మంత్రి పృథ్వీ సుబ్బా గురుంగ్, మాజీ హోం మంత్రి రమేశ్ లఖ్వార్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాల ఇళ్లను నాశనంచేశారు. ఆందోళనలు కాఠ్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్నీ తాకాయి. దీంతో ముందుజాగ్రత్తగా అంతర్జాతీయ విమానసర్వీసులను రద్దుచేసి ఎయిర్‌పోర్ట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసేశారు.

**ఎటుచూసినా విధ్వంసమే**

ఆందోళనలను ఏ దశలోనూ అడ్డుకోలేక పోలీసులు చేతులెత్తేయడంతో విద్యార్థులు, నిరసనకారుల విధ్వంసకాండ ఆకాశమే హద్దుగా సాగింది. పార్లమెంట్, దేశాధ్యక్షుని కార్యాలయం, ప్రధాని నివాసం, సుప్రీంకోర్టు భవనం, ప్రధాన రాజకీయ పార్టీల హెడ్‌ఆఫీస్‌లు, సీనియర్ నేతల ఇళ్లు, మీడియా కార్యాలయాలు ఇలా ప్రతి దేశంలోని కీలక భవంతులన్నీ ఆందోళనకారుల ఆగ్రహజ్వాలల బారినపడ్డాయి. డల్లూ ఏరియాలోని మాజీ ప్రదాని ఝలానాథ్ నివాసానికి నిప్పుపెట్టారు. కపన్ ప్రాంతంలోని నేపాలీ కాంగ్రెస్ నేత ఇంటిని తగులబెట్టారు. సింఘదర్బార్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం భవనానికీ నిప్పుపెట్టారు. మహరాజ్‌గంజ్‌లోని అధ్యక్షకార్యాలయం, బలూవతార్‌లో ప్రధాని అధికారి నివాసం సైతం నిప్పురవ్వల వర్షంలో కాలిపోయాయి.



## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఘనంగా తెలంగాణ భాష దినోత్సవ వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 9 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రాయికల్ ఉప్పుమడుగు నందు సెప్టెంబర్ 9 మంగళవారం నాడు కాళోజి నారాయణరావు జన్మదిన పురస్కరించుకుని తెలంగాణ భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపన్యాసాలతో తెలంగాణ భాష దినోత్సవం ప్రాముఖ్యతను వివరించడం జరిగింది మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిని ఎన్ శోభారాణి మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వండి


మన్ననూర్-శ్రీశైలం మధ్య నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సీఎం రేవంత్ ప్రతిపాదించారు. దీనితో పాటు రావిర్యాల-ఆమన్‌గల్-మన్ననూర్ మార్గాన్ని నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా, రద్దీ అధికంగా ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా హైదరాబాద్-మంచిర్యాల మధ్య కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని కోరారు. సీఎం విజ్ఞప్తులపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ కింద ప్రతిపాదించిన రూ.868 కోట్ల పనులకు వారంలోగా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. బందరు పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై ఈ నెల 22న హైదరాబాద్‌లో ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూలంగా మార్చేందుకు తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లతో ప్రణాళిక రూపొందించిందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. మంగళవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్ కార్యాలయంలో ఆమెను కలిసి.. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి ఉద్దేశించిన రూ.30 వేల కోట్ల ప్రణాళికకు అనుమతులివ్వాలని కోరారు. 105 నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది చొప్పున సుమారు 2.70 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ఈ స్కూళ్లకు రూ.21 వేల కోట్లు, ఇతర ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. నిధుల సమీకరణకు ఏర్పాటు చేసే ప్రత్యేక కార్పొరేషన్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం కోరారు.

## పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన వారు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోలేని దురవస్థలో ఉన్నారన్నారు. స్పీకర్ నిర్ణయంలో తేడా ఉంటే.. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడింది సుప్రీంకోర్టు ముందు పెడతామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని.. రాజకీయ కక్షతో కేసీఆర్‌పై కేసు పెట్టేందుకు యత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రాజెక్ట్‌కు ఖర్చు చేసిందే రూ.94 వేల కోట్లు అని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ మామ పద్మారెడ్డి క్లియర్‌గా చెప్పారని.. అలాంటప్పుడు లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పిల్లర్లలో రెండు కుంగిపోతే అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించి.. రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

చేపట్టారు. రాత్రి 7.30 కి ఫలితాలు ప్రకటించారు. భారత 17 వ ఉప రాష్ట్రపతిగా ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ . 1957 అక్టోబరు 20న తమిళనాడు లోని తిరుప్పూర్‌లో సీకే పొన్నుస్వామి, కె. జానకి దంపతులకు ఆయన జన్మించారు. 16 ఏళ్లకే ఆర్ఎస్ఎస్‌లో చేరారు. ఆయనను తమిళనాడు మోడీ అని పిలుస్తుంటారు. తూత్తుకుడి లోని విఓ చిదంబరం కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ అందుకున్నారు. 1974లో ఆయన జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి ఎన్నికయ్యారు. 1980 లో బీజేపీలో చేరారు. అటల్ బిహారీ వాజ్‌పాయ్‌కు సన్నిహితుడు. ప్రస్తుతం ఆయన తమిళనాడు గవర్నర్‌గా కొనసాగుతున్నారు. అంతకు ముందు ఆయన జులై 31, 2024 రెంయి మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందించారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళసై సౌందర్ రాజన్ రాజీనామా చేయడంతో ఆమె స్థానంలో తెలంగాణ పుదుచ్చేరి గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలు పార్లమెంట్ కమిటీలకు ఛైర్మన్‌గా, సభ్యుడిగా పనిచేశారు. స్టాక్‌మార్కెట్ కుంభకోణంపై విచారణకు సారథ్యం వహించారు. బీజేపీ నుంచి 1998 లో కోయంబత్తూరు నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1999 సార్వత్రిక ఎన్నికల్లోనూ మళ్లీ గెలుపొందారు. 2004 నుంచి మూడేళ్లు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడుగా ఉన్నారు. . 93 రోజుల పాటు 19000 కిలోమీటర్ల మేర రథయాత్ర చేశారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన కె. సుబ్బరాయన్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఇటీవల జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడంతో బీజేపీ ఆయనను ఎన్డీయే అభ్యర్థిగా ప్రకటించింది. తమిళనాడు నుంనచి ఉప రాష్ట్రపతి పీఠం అధిష్ఠించనున్న మూడో వ్యక్తిగా రాధాకృష్ణన్ గుర్తింపు పొందారు.



**మరింత బలంగా సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తా : సుదర్శన్ రెడ్డి**

మరింత బలంగా సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తానని ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపే కాదు. ఓటమిని స్వీకరించాలన్నారు. ఫలితాలు నాకు అనుకూలంగా రాలేదు. ప్రజస్వామ్యబలం , కేవలం విజయంలో మాత్రమే లేదు. చర్చలు, నిరసన ద్వారా కూడా ప్రజాస్వామ్యం బలపడుతుంది. విజయం సాధించిన రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు అని తెలిపారు.

**రాధాకృష్ణన్‌కు అమిత్‌షా అభినందనలు**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన రాధాకృష్ణన్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్‌సా శుభాకాంక్షలు తెలిపారు. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన నాయకుడని ఆయన కొనియాడారు. రాధాకృష్ణన్‌కు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుభాకాంక్షలు తెలియజేశారు. అదే సమయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోరాటానికి సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది ఎన్నిక మాత్రమే కాదు. ఇది సిద్ధాంతాల యుద్ధం. పార్లమెంట్ సంప్రదాయాలను, రాధాకృష్ణన్ కాపాడతారని ఆశిస్తున్నా. ప్రతిపక్షాలకు సరైన సమయం కేటాయిస్తారని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.

## ఫార్ములా ఈ- కారు రేసుపై ఏసీబీ నివేదిక

ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. రూ.55 కోట్ల హెచ్ఎండీఏ నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏసీబీ తుది నివేదిక అందించింది. ఈ కేసులో విధానపరమైన లోపాలు ఉన్నాయని వెల్లడించింది. హైదరాబాద్‌లో తొలిసారి 2023 ఫిబ్రవరిలో ఫార్ములా ఈ%-%కారు రేసు సంస్థ రేసును నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పట్లో స్పాన్సర్లతో తొలి రేసు నిర్వహించినా, అందుకు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. తొలిసారి స్పాన్సర్లుగా వ్యవహరించిన సంస్థలకు ఆశించిన మేరకు ఆదాయం రాకపోవడంతో... 2024లో నిర్వహించాల్సిన రెండో రేసు నుంచి స్పాన్సర్లు తప్పుకున్నారు. రేసు నిర్వహణకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో ఫార్ములా ఈ- కారు రేసు నిర్వాహకులు వెంటనే నిధులు ఇస్తే తప్ప.. 2024 ఫిబ్రవరిలో రేసు కేటాయించడం సాధ్యం కాదంటూ ఒత్తిడి తేవడం, స్పాన్సర్లు ముందుకు రాకపోవడంతో అప్పట్లో హెచ్ఎండీఏ నుంచి ఫార్ములా ఈ%-%కారు రేసు సంస్థకు విదేశీ కరెన్సీలోనే నిధులు చెల్లించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి కూడా తీసుకోలేదని, ఆర్థికశాఖ నుంచి కూడా అనుమతి తీసుకోలేదని తన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారం మారడంతో...ఫార్ములా ఈ%-% కారు రేసును రద్దు చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఎన్నికల సమయంలో హెచ్ఎండీఏ నుంచి నిధులు విదేశాలకు తరలివెళ్లాయని తెలియడంతో.. అప్పటి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ ఈ నిధులు మళ్లింపుపై విచారణ చేయాలని అవినీతి నిరోధక శాఖకు లేఖ రాసిన సంగతి విదితమే. ఆ తర్వాత ఏసీబీ అధికారులు అప్పట్లో పురపాలకశాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌ను రెండుసార్లు, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందర్‌కుమార్‌ను మూడుసార్లు, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిలను మూడుసార్లు ప్రశ్నించింది.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ధర్మశాల/చండీగఢ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన ఇళ్లు, రహదారులను స్వయంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడడంతో తీవ్రంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద రూ.1,500 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వరదల్లో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఏరియల్ సర్వే అనంతరం కాంగ్రా పట్టణంలో ప్రధాని మోదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ పునరావాస చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ పాల్గొన్నారు. వరద బాధితులు సైతం హాజరై తమ గోడు వినిపించారు. తమను ఆదుకోవాలని ప్రధాని మోదీని వేడుకున్నారు. కచ్చితంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. వరదల్లో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పునర్నిర్మించాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 8 దాకా వరదలు, కొండచరియల కారణంగా ఏకంగా 370 మంది మృతిచెందారు. ప్రధాని మోదీ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటన అనంతరం పంజాబ్‌కు చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. బాధితులను కలిసి మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోనూ మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. గురుదాస్‌పూర్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. పంజాబ్‌కు తక్షణ సాయం కింద రూ.1,600 కోట్లు అందజేస్తామని ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. 51 మంది మరణించారు. 1.84 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. రూ.13,000 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. రూ.20,000 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రకటించాలని ప్రధాని మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.

# గ్రూప్1 జవాబు పత్రాలు మళ్లీ దిద్దాల్సిందే!

మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా(జీఆర్ఎల్)ను రద్దు చేసింది. గ్రూప్%-%1 మెయిన్స్‌కు సంబంధించిన అన్ని సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. సంజయ్‌సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, అలహాబాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు మోడరేషన్ పద్ధతిని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఆ ఫలితాల ఆధారంగా 563 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇది సాధ్యంకాని పక్షంలో గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్ష రద్దు చేసి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అందరికీ తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియంతా మంగళవారం నాటి ఉత్తర్వుల కాపీ అందిన రోజు నుంచి 8 నెలల్లో పూర్తి చేయాలంటూ కీలక తీర్పు వెలువరించింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సుదీర్ఘ వాదనల అనంతరం.. జూలై 7న తుది తీర్పు రిజర్వు చేశారు. తాజాగా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన మొత్తం సమస్యను విధానపరమైన, మూల్యాంకన విధానం అనే రెండు కేటగిరీలుగా విభజించవచ్చునని న్యాయమూర్తి తెలిపారు. ఒక్కో కేటగిరీలోని అంశాల వారీగా తీర్పు ఇచ్చారు.

**1) విధానపరమైన అంశాలు..**

రెండు హాల్ టికెట్ల జారీ: 2024 ఫిబ్రవరి 19న టీజీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండు హాల్‌టికెట్ల ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కమిషన్ వివరణ కూడా అస్పష్టంగా ఉంది. యూపీఎస్సీనే ఒక హాల్‌టికెట్ ఇస్తున్నప్పుడు.. ఇక్కడ రెండు ఎందుకనే దానిపై వివరణ నమ్మశక్యంగా లేదు. 2011లో ఇదే విధానం అనుసరించినట్లు కమిషన్ పేర్కొన్నా.. ఆ డాక్యుమెంట్లను సమర్పించలేదు. నోటిఫికేషన్ లేదా నిబంధనల మేరకు పరీక్ష జరగలేదని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది. కేంద్రాల కేటాయింపు: 18, 19 పరీక్షా కేంద్రాల్లో మహిళా అభ్యర్థులకే ప్రాధాన్యత ఎలా ఇచ్చారు. రాండమైజేషన్ విధానమే అయితే ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను రెండు కేంద్రాలకే ఎలా కేటాయించారు? మహిళా అభ్యర్థులనే కేటాయించాలని కళాశాల అధికారులు చెప్పినట్లు కమిషన్ పేర్కొన్నా ఆధారాలను సమర్పించలేదు. అసలు అలా కేటాయింపులో ప్రాధాన్యత ఎందుకో కమిషన్ చెప్పలేదు. నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. మరోవైపు శారీరకంగా వికలాంగులైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నగరానికి దూరంగా 2వ, 3వ అంతస్తుల భవనాలను కేటాయించింది. ఇది కేంద్రాలను కేటాయించడంలో వివక్షను ప్రతిబింబిస్తోంది. మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యను.. 21,093, 21,085, 21,110, 20,161గా ఇలా ఒక్కోసారి ఒక్కోలా పేర్కొంది. అభ్యర్థుల హాజరు నమోదులో కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాజ్యాంగ సంస్థ ఇలా చేయడం ప్రశంసించలేం. తుది మార్కుల జాబితా విడుదల సమయంలో 21,085 మందిగా పేర్కొంది. సంఖ్యలో మార్పునకు ఎటువంటి వివరణ లేదు.

**బహుళ మూల్యాంకనం:**

జవాబు పత్రాల తొలి రెండు మూల్యాంకనాల్లో మార్చి 13 నాటి వెబ్ నోట్ ప్రకారం బార్‌కోడ్, బబ్లింగ్‌లున్నాయి. మూడో మూల్యాంకనంలో ఇవి లేవు. ఏపీలో నిర్వహించినట్లు ఇక్కడా చేశామని కమిషన్ చెప్పినా మూడో మూల్యాంకనం భిన్నంగా ఉండటంతో మార్కులను మార్చే అవకాశం ఉంది. నోటిఫికేషన్‌లో మూడో మూల్యాంకనంపై వివరాలు లేవు. కమిషన్ చర్యలు గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్ష పవిత్రతను దెబ్బతీశాయి. మూల్యాంకన ప్రక్రియ పిటిషనర్ల వాదనలకు బలాన్ని చేకూర్చింది. వారి వాదన తోసిపుచ్చలేం.

**మార్కుల జాబితా ప్రచురణ:**

నిబంధనల ప్రకారం అభ్యర్థుల మార్కులను సబ్జెక్టుల వారీగా ప్రచురించాలి. అలా చేయకుండా కమిషన్ వ్యక్తిగత లాగిన్‌లకు సబ్జెక్టుల వారీగా పంపింది. అంటే ఎవరి మార్కులు వారికే కనిపిస్తాయి తప్ప.. ఇతరుల మార్కులు తెలియవు. ఇది సరికాదు. అందరి అభ్యర్థుల మార్కులతో జాబితాను ప్రచురించకపోవడం పారదర్శకతను దెబ్బతీస్తోంది. దీనిపై కమిషన్‌ను ప్రశ్నించే హక్కు అభ్యర్థులకు ఉంది.

**అర్హత సాధించని అభ్యర్థుల పేపర్లు మూల్యాంకనం:**

ఇంగ్లిష్ పరీక్షలో అర్హత సాధించిన తర్వాతే ఇతర పేపర్లు మూల్యాంకనం చేశామని కమిషన్ చెప్పింది. అయితే జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించని వారి పేపర్లూ మూల్యాంకనం చేసినట్లు 12 మంది పేర్లు పరిశీలిస్తే తెలుస్తోంది. పరీక్ష నిర్వహణలో అసమగ్రతను ఇది స్పష్టం చేస్తోంది. దశాబ్దంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది అశనిపాతం లాంటిది.

**ఖాళీలు పెంచడం:**

రెండో నోటిఫికేషన్ ద్వారా ఖాళీల సంఖ్య పెంచారు. మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. అంతకుముందు దరఖాస్తు చేసుకోని వాళ్లు కూడా కొత్తగా రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అయితే దీనిపై ఇప్పటికే ఇదే హైకోర్టు తీర్పునిచ్చింది. అందుకే ఈ అంశంపై విచారణకు నిరాకరించాం.

**2) మూల్యాంకన విధానం.. మూల్యాంకనదారుల ఎంపిక:**

రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు రిటైర్డ్ అధ్యాపక సభ్యులను మెయిన్స్ మూల్యాంకనానికి నియమించినట్లు కమిషన్ పేర్కొంది. వీరి పేర్లను రహస్యంగా ఉంచామని, పిటిషనర్లు బహిర్గతం చేసినందుకు చట్టప్రకారం చర్యలు తీసుకునే హక్కు ఉందని వాదించింది. అలాంటప్పుడు ఆ వివరాలిచ్చిన కమిషన్ ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే తీసుకోవాలన్నది పిటిషర్ల వాదన. ప్రైవేట్ ట్యూటర్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.ఎ.మాలిక్‌ను కూడా తీసుకున్నారని వారు తెలిపారు. ఇతను 22 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికలకు పోటీ పరీక్షల కథనాలను అందిస్తున్నాడని పేర్కొన్నారు. దీనిని అంగీకరించని కమిషన్ పిటిషనర్లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించింది. అలాగే కమిషన్ రెగ్యులర్ ఫ్యాకల్టీ అనే దానికి అర్థాన్ని మార్చింది.

పత్రాలు దిద్దిన విధానం:

సమాధాన పత్రాల మూల్యాంకనానికి ఏదైనా విధానం ఉందా? కీ ఉందా? అని కమిషన్‌ను ప్రశ్నించాం. ఎటువంటి కీ లేదని, మూల్యాంకనదారులు సబ్జెక్ట్ నిపుణులని పేర్కొంది. తర్వాత కీ ఉందని సీల్డ్ కవర్‌లో సమర్పించింది. కీ విషయంలో కమిషన్ తన వాదనను ఎప్పటికప్పుడు మార్చింది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాలపై ఏదైనా కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టాలనుకుంటే సర్కార్‌ను సంప్రదించాలి. కానీ అలా జరగలేదని తెలుస్తోంది. కోర్టుకు సమర్పించిన కీలోనూ లోపాలున్నాయి.



## ఆర్థిక సాయం అందజేసిన స్నేహ యూత్ 95 96 బ్యాచ్

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్0 9 ( వార్త మిర్రర్ )

నారాయణపురం పదవ తరగతి 95 96 బ్యాచ్ సభ్యురాలు పోలోజు .జ్ఞానేశ్వరి భర్త పోలోజు. పుల్లయ్య చారి అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలడం వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు అని తెలుసుకొని చిన్ననాటి మిత్రులందరూ కలిసి ఆరోగ్య క్షేమాలు తెలుసుకోవడం జరిగింది,వారి కుటుంబానికి మేమున్నాం అని ధైర్యాన్ని కల్పిస్తూ తుంగతుర్తి తొలి శాసనసభ్యులు డాక్టర్ .గాదిరి .కిషోర్ కుమార్ మిత్రులందరి సహకారంతో వారికి 30 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తూ దేవుడు త్వరగా చారికి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించడమైనది. ఈ కార్యక్రమంలో స్నేహ యూత్ అధ్యక్షులు అజహర్ ,వెంకటేష్ లక్కీ పాక సత్యనారాయణ, మధు ,కొండ యాదమ్మ, మహిళా సభ్యులు తహసీన్ ఫాతిమా, నవనీత, ఉమా రెడ్డి తదితరులు పాల్గొనడం జరిగింది, ఆపదలో ఉన్న వారిని ఒకరికొకరు సహకారాన్ని అందిస్తూ ఐకమత్యంతో ముందుకు కదలాలని సమాజానికి సందేశాన్ని ఇచ్చారు



## యూరియా కొరతపై మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే బిఎల్ఆర్ మరోసారి భేటీ

### గురువారం వరకు రైతుల సమస్యను పరిష్కరిస్తామని హామీ

మిర్యాలగూడ సెప్టెంబర్ 9:- (వార్త మిర్రర్) హైదరాబాద్ లోని రాష్ట్ర సెక్రటేరియట్ లో మరోసారి యూరియా కొరత, రైతుల సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం మరోసారి కలిసి విన్నవించారు. త్వరగా యూరియా సమస్యను పరిష్కరించాలని మంత్రికి విన్నవించడంతో గురువారం వరకు సమస్యను పూర్తిగా తీర్చేందుకు రైతులకు కావాల్సినంత యూరియాను సమకూర్చుతామని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హామీ ఇచ్చారని తెలిపారు.



## రైతులకు యూరియా కష్టాలు తీరేనా రైతుసంఘం నేతలు బంటు, వీరపల్లి

మిర్యాలగూడ సెప్టెంబర్ 9:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం యాద్గారుపల్లి గ్రామంలో యూరియా కోసం బారులు తీరిన రైతులను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(సిపిఐ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు తెలంగాణ రైతు సంఘం (సిపిఎం)జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు కలిసి రైతులతో మాట్లాడి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల యూరియా కష్టాలు ఇంకెన్నడు తీరునని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గంటలు తరబడి క్యూలో నిలబడి ఒక్కొక్క మనిషికి 2 బస్తాల చొప్పున ఇవ్వడంతో రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రానికి అవసరమైనంత యూరియా పంపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు అనేక జిల్లాలలో మండలాలలో యూరియా కోసం రోజుల తరబడి పడిగాపులు కాసినా కూడ యూరియా దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అక్కడున్న రైతులు అప్పనబోయిన వెంకటయ్య, వస్కుల రవి, కన్నికంటి రామకృష్ణ, అప్పనబోయిన పురుషోత్తం, చింతమల రాములు, గువ్వలమట్టయ్య సిహెచ్ ఆంజనేయులు బొబ్బిలి ప్రశాంత్, గువ్వల శేఖర్, ప్రతాప్, బంటు నరసయ్య, వెంకన్న, రామలింగయ్య, లక్ష్మీ, లక్ష్మమ్మ, యశోద రైతులు ఉన్నారు



## అందెలకు వినాయకుని లడ్డు ప్రసాదాన్ని అందజేసిన విజేందర్

వార్త మిర్రర్ రంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 09 :

మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ క్లస్టర్ టు ఉపాధ్యక్షుడు విజేందర్ (బిట్టు) వారి కాలనీలోని వినాయకుని వేలంపాటలో 1,15,000 వేల రూపాయలకు లడ్డూను సొంతం చేసుకోవడం జరిగింది వేలంపాటలో దక్కించుకున్న వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్ కి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ కార్పొరేషన్ కస్టర్ 2 అధ్యక్షుడు రామిడి వీరకర్ణ రెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకట రెడ్డి కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, గిరి, సతీష్ నంద కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది

## న్యాయవాది పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ చౌటుప్పల్ బార్ అసోసియేషన్ నిరసన

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

న్యాయవాది సురేష్ బాబు కోర్టు బెలీఫ్‌తో కలిసి సివిల్ కేసులో కోర్టు జారీ చేసిన వారెంట్‌ను అమలు చేయడానికి కాక్షిదారులతో కలిసి వెళ్లారు.అయితే వృత్తి పరమైన విధుల్లో భాగంగా వారెంట్ అమలు చేస్తున్న సమయంలో,కొంతమంది అరాచకులు న్యాయవాది పై దాడి చేయడం జరిగింది. ఈ ఘోర సంఘటన న్యాయవాదుల సమాజానికి తీవ్రఆందోళన కలిగించింది.ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లు ఈరోజు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆ పిలుపులో భాగంగా చౌటుప్పల్ కోర్టులో కూడా న్యాయవాదులు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి మాట్లాడుతూ,వృత్తి పరంగా విధులు నిర్వహిస్తున్న న్యాయవాది పై దాడి చేయడం అమానవీయమైనది, మేము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. దాడి చేసిన నేరస్థులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాద రక్షణ చట్టం అమలు చేయాలని ఈ సందర్భంగా మేము బలంగా కోరుతున్నాము," అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు గత కొన్నేళ్లుగా పునరావృతం అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం విచారకరం. న్యాయవాదులు చట్టపరమైన పరిధిలో



కక్షిదారులకు అండగా నిలబడి న్యాయం సాధనలో పోరాటం చేస్తున్నారు. ఈ విషయం ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాపోలు వేణు, ప్రధాన కార్యదర్శి పదమటి మైపాల్ రెడ్డి,కల్చరల్ సెక్రటరీ దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యుడు ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్, వాకిటి నరసింహారెడ్డి, న్యాయవాదులు తడక మోహన్,చామట్ల జంగయ్య, గంగదేవి రవీందర్, భరత్ చంద్ర,శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి బాతుకమ్మ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

### ఈనెల 24వ తేదీన హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై 200 మంది మహిళలతో బతుకమ్మ ఉత్సవాలు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి తెలంగాణ సగర మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం తెలంగాణ సగర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరపాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. సోమవారం హైదరాబాద్ అంజయ్య నగర్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర,రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర ముఖ్య అతిథులుగా హాజరై మార్గనిర్దేశం చేశారు ఈనెల 24 వ తేదీన హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరపాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘంగా మహిళా సంఘం రాష్ట్ర కమిటీ గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని పలు ప్రాంతీయ సంఘాల మహిళా సంఘాల నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు 2 వేల మంది సగర మహిళలతో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరపాలని కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. బతుకమ్మ వేడుకల ద్వారా సగర జాతి మరింత వెలుగులోకి రావడం కోసం మహిళా సంఘం రాష్ట్ర కార్యవర్గంతో పాటు అన్ని జిల్లాల మహిళా సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నాయకులు అభిప్రాయపడ్డారు.



ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీమతి విజయలక్ష్మి సగర, కోశాధికారి శ్రీమతి జయమ్మ సగర, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం సగర, రంగారెడ్డి జిల్లా సగర సంఘం అధ్యక్షులు మర్కా సతీష్ సగర, రాష్ట్ర మహిళా ఉపాధ్యాక్షరాలు, కార్యవర్గ సభ్యులు, జగద్గిరిగుట్ట మహిళా సగర కమిటీ సభ్యులు, అంజయ్య నగర్ మహిళా కమిటీ సభ్యులు, మూసాపేట్ కమిటీ మహిళా సభ్యులు, ఫిలింనగర్ మహిళా కమిటీ సభ్యులు, రాయిదుర్గం మహిళ కమిటీ,మణికొండ మహిళా కమిటీ సభ్యులు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మహిళా సంఘాల కార్యవర్గ సభ్యులందరూ హాజరయ్యారు.

## నేటి నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

### మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ , సెప్టెంబర్ 9:-( వార్త మిర్రర్)నేటి నుండి ఈ నెల 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రకటించారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ వన్, టూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆనాడు భూస్వామ్యులకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం జరిగిందని అందులో అన్ని కులాల వారు పాలుపంచుకున్నారన్నారు. కానీ కొన్ని పార్టీలు దానిని మతం రంగు పూసి చిత్రీకరిస్తున్నారని వాస్తవానికి వారోత్సవాలు చేసుకునే వారసత్వం ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఊరు ఊరు వాడవాడలో తెలంగాణ రైతంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈనెల 11న మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో అమరవీరుల కుటుంబాలకు సన్మానించనున్నట్లు తెలిపారు. దీనికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నట్లు తెలిపారు. ఈనెల 17న నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తామని ఈ సభకు పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ హాజరవుతున్నట్టు చెప్పారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరై వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గ్రామాలలో వాడలలో ఇంటింటికి సిపిఎం అనే పేరుతో అధ్యయన యాత్రలు చేపడుతున్నామని అందులో వచ్చిన సమస్యలను గుర్తించి వాటి



పరిష్కారం కోసం అధికారులపై ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు మూడవత్ రవినాయక్, అయూబ్, వన్ టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, బావాండ్ల పాండు, లక్ష్మీనారాయణ సత్యనారాయణ రావు, గోవర్ధన, ఊర్మిళ, అరుణ, కరిమునిసా, కోడిరెక్క మల్లయ్య, రామచంద్ర, ఏసు, రామారావు, పల్లా బిక్షం, కుంచం లింగయ్య పాల్గొన్నారు.

## ఈ నెల 17వరకు జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

### ఔట్ సోర్సింగ్ కార్మికులను పేర్మినెంట్ చేయాలి

### ఎఐసిటీయు రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్

మిర్యాలగూడ సెప్టెంబర్ 9:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామంలో ఎస్ఎన్డి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఎఐసిటీయు నల్లగొండ జిల్లా జనరల్ బాడీ సమావేశం మంద అనుక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎఐసిటీయు రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం 30 వేల రూపాయలు అమలు చేయాలని ఈపీఎఫ్ పెన్షన్ 15 వేల రూపాయల అమలు చేయాలని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారికి కనీస వేతనం 30 వేలు అమలు చేయాలని విధినిర్వాహణలో మృతి చెందిన వారికి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఢిల్లీ తరహాలో 30 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని అన్నారు భవన నిర్మాణ కార్మికులు విధి నిర్వహణలో మృతిచెందితే 50 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు అసంఘటిత కార్మికులకు సమగ్ర రక్షణ చట్టం రూపొందించాలని పదివేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు అన్ని ప్రభుత్వ శాఖలలో ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరినారు వీర తెలంగాణ సాయుధ పోరాటంలో




ఎంతోమందిని పోగొట్టుకున్న గడ్డ నల్గొండ జిల్లా అన్నారు పదో తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చినారు ఈ సమావేశంలో ఏ ఐ సి టి యు రాష్ట్ర కమిటీ సభ్యులు కర్ర దానయ్య ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి నాయకులు మోహన్ నాయక్ జ్యోతి శివ ఆశీర్వాదం వీరయ్య కమలమ్మ ఆదిలక్ష్మి అనసూయ సైదులు నాగయ్య మల్లేష్ రవి తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్ లో జరిగే బిగ్ డిబేట్ జయప్రదం చేయండి

### జార్జి రెడ్డి పిడిఎస్ యుఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి కళాచారి

దేవరకొండ సెప్టెంబర్ 09 వార్త మిర్రర్:పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పి డి ఎస్ యుతెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 న హైదరాబాద్ లో జరిగే బిగ్ డిబేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జార్జి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.అంజి, నల్గొండ జిల్లా అధ్యక్షులు కళాచారి లు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడున్నరేళ్లుగా విద్యార్థులకు అందించే ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు సుమారు 8000 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయని అన్నారు. దీని వలన విద్యార్థులు ఉన్నత విద్యకు తీవ్ర ఆటంకాలు ఎదుర్కొంటున్నారని అన్నారూ. గత ఏడాది కాలంగా విద్యార్థులు,తల్లి తండ్రులు తీవ్ర ఆందోళన పడుతున్నారని అన్నారు. దేశ విద్యా అభివృద్ధికి దారులు వేసే విద్యార్థులకు, విద్యా రంగానికి నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం ,వివక్ష తగదని హితవు పలికారు. విద్యార్థి సంఘాలు దశల వారీగా ఈ సమస్య పరిష్కారానికి పోరాడుతున్నామని తెలిపాయి. ఈ వెలుగులో ప్రభుత్వం పై మరింత ఒత్తిడి పెంచి, నిధులు విడుదల చేసేలా కృషి చేయడానికి జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ రాష్ట్ర కమిటీ బిగ్ డిబేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యా వేత్తలు, విద్యార్థి, మహిళా,ప్రజా సంఘాల నేతలు ,వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతారని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల కొరకు విద్యార్థులు పోరు బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పిడిఎస్యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అంజి. జిల్లా




కమిటీ సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల ద్వారా విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ కలవర్చుకోవాలి లి డి.ఎస్.పి రాజశేఖర్ రాజు

మిర్యాలగూడ ,సెప్టెంబర్ 9:-( వార్త మిర్రర్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మిర్యాలగూడ నియోజక వర్గస్థాయి పాఠశాలల క్రీడోత్సవాలు మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో అండర్ 17 ,అండర్ 14 బాల బాలికల క్రీడా పోటీలు ఈనెల 9,10 తారీకులలో నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమానికి. మిర్యాలగూడ ఎంఈఓ లావూరి బాలు అధ్యక్షత వహించారు. వివిధ మండలాలకు చెందిన బాలికలు మార్చి ఫస్ట్ నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన అనంతరం డి.ఎస్.పి రాజశేఖర్ రాజు క్రీడలను ప్రారంభిస్తూ ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని క్రీడలు మీ జీవితంలో భాగం చేసుకోవాలని గెలుపోటములు సహజమని వీటిని అధికమించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని క్రీడల ద్వారా జీవితంలో క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. మరొక ముఖ్యఅతిథి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ దగ్గుపాటి విమల మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి నియోజకవర్గ స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నందుకు మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు వ ఎమ్మెల్యే బిఎల్ఆర్ సహకారంతో చక్కని భోజనం మరియు గిఫ్ట్ లు ఏర్పాటుచేసిన మిర్యాలగూడ ఎస్జీఎఫ్ టీమ్ కు అభినందన తెలియజేశారు. ఎంఈఓ లావూరి బాలు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి క్రీడల టోర్నమెంట్ విచ్చేసిన ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో పాల్గొని , మంచి క్రీడను ప్రదర్శించాలని కోరారు . ఎజిఎఫ్ మిర్యాలగూడ నియోజకవర్గ కన్వీనర్ శోభారాణి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో క్రీడా జట్టులను



ఎంపిక చేసి త్వరలో జరిగే పార్లమెంట్ స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మార్వో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి అలగడప గజిటెడ్ హెడ్ మాస్టర్ వెంకట రెడ్డి, పిజి పేట జిల్లా అధ్యక్షులు సురేందర్ రెడ్డి , సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు పి సైదులు , కె మనోహరి, కే వెంకటయ్య ఎండి షాహిద్ , ఏ యుగంధర్ రెడ్డి ,పి వెంకట్ రెడ్డి కే రవీందర్ , అరుణమ్మ , ఇందిర సావిత్రి , నాగలక్ష్మి అనిల్, జోజి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు షేక్ ఫరూక్ జన్మదిన వేడుకలు.

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఫరూక్ తన పుట్టినరోజుసందర్భంగా బీజేపీ కుటుంబ సభ్యులతో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఏ ఏ ఎఫ్ ట్రూ హెల్పింగ్ హాండ్స్ సమస్త ద్వారా అనాధ పిల్లలకు భోజనాలు, స్వీట్స్ పంపిణీ చేయడం విశేశాం, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని, నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆ భగవంతున్ని కోరారు. ఫరూక్ మాట్లాడుతూ నాకు చాలా సంతోషంగా ఉంది ఇల అనాధ పిల్లలతో నా జన్మదిన వేడుకలు జరుపుకోవడం నాకు దేవుడిచ్చిన వారమని అన్నారు.నాకు వీలున్నప్పుడల్లా నాతోటి స్నేహితులతో కలిసి వీలైనంతవరకు అనాధ పిల్లలకు నాకు అయినంత సహాయం చేస్తానని చెప్పుకొచ్చారు.

# రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ అండ్ ఎస్ టి ఈ ఎం విద్యా కార్యక్రమం







యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆర్ కె ఎస్ సి రాచకొండ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి, ఆర్ కె ఎస్ సి చైర్మన్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ మరియు వైస్ చైర్మన్ పి. సుధాకర్, జీఎం, డివిస్ లాబొరేటరీస్, వారి నాయకత్వం మరియు మార్గదర్శకత్వంలో, సామాజిక అవుట్ రీచ్ కార్యక్రమం లో భాగంగా, రెండు రోజుల మెగా హెల్త్ క్యాంప్‌ను బొమ్మలరామారం మండలంలోని జెడ్పీహెచ్ఎస్ జలాల్పూర్‌లో సెప్టెంబర్ 8 మరియు 9, 2025 తేదీలలో విజయవంతంగా నిర్వహించింది.ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు పాల్గొనడం విశేషం.ఈ హెల్త్ క్యాంప్‌కు బసవతారకం హాస్పిటల్ (క్యాన్సర్ స్క్రీనింగ్, అల్ట్రాసౌండ్, మామోగ్రామ్, జనరల్ ఫిజీషియన్స్ మరియు గైనకాలజిస్టులతో కన్సల్టేషన్), సోలిస్ ఐ కేర్ హాస్పిటల్ (కంటి సంబంధిత పూర్తి వైద్య సేవలు), ఎంఏఏ ఈ ఎన్ టి హాస్పిటల్ (చెవి, ముక్కు, గొంతు చికిత్సలు), స్మైల్ గార్డ్ డెంటల్ హాస్పిటల్ (దంత వైద్య సేవలు, మౌత్ క్యాన్సర్ స్క్రీనింగ్), జీనియా హాస్పిటల్ ఈసీజీ కార్డియాలజీ సేవలు, రాండమ్ బ్లడ్ షుగర్ టెస్టులు) వంటి ప్రతిష్టాత్మక ఆసుపత్రులు విశేష సహకారం అందించాయి.ఎస్ఎన్ఐఎస్టి%-%ఎన్ఎస్ఎస్‌కు చెందిన గ్రూప్ లీడర్ మణివర్ధన్ రెడ్డి నాయకత్వంలో 40 మంది వాలంటీర్లు సమర్పణతో సేవలందించారు.ఈ అవుట్ రీచ్‌లో భాగంగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీ సి ఎస్) తో కలసి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ ( ఎస్ టి ఈఎం) విభాగాలపై అవగాహన కల్పించడంతో పాటు, 15 సంవత్సరాలు పైబడిన అక్షరాస్యత లేని మహిళల్లో ప్రాథమిక శాస్త్రీయ జ్ఞానం పెంపొందించే ప్రత్యేక ఎస్టి అండ్ ఎం ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆర్ కె ఎస్ సి ప్రారంభించింది.ఈ కార్యక్రమానికి రాచకొండ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ముఖ్య అతిథులు హాజరై మద్దతు తెలిపారు. వీరిలో భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ (కన్వీనర్ %-% సోషియల్ అవుట్ రీచ్,ఆర్ కె ఎస్ సి, భువనగిరి ఏసీపీ శ్రీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ భువనగిరి రూరల్ సీఐ ఎన్. చంద్రబాబు, బొమ్మలరామారం ఎస్‌హెచ్ఓ శ్రీశైలం యాదవ్ ఉన్నారు.ఆర్ కె ఎస్ సి తరఫున జనరల్ సెక్రటరీ శ్రీ రఘువీర్, జాయింట్ సెక్రటరీ మరియు సి డి సి డైరెక్టర్ వాసుదేవ్ రావు, చీఫ్ కోఆర్డినేటర్ శ్రీమతి ఎం. సావిత్రి పాల్గొన్నారు.ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తరఫున బొమ్మలరామారం ఎంఈఓ డి. రోజారాణి, జెడ్పీహెచ్ఎస్ జలాల్పూర్ హెడ్ మిస్ట్రెస్ పి. నిర్మల జ్యోతి హాజరయ్యారు.ఆరోగ్య సేవలను, విద్యా శక్తివంతీకరణతో కలిపి సమగ్రంగా చేపట్టిన ఆర్ కె ఎస్ సి ఈ వినూత్న ప్రయత్నం స్థానిక సమాజంపై సార్థకమైన మరియు చిరస్థాయిగా నిలిచే ప్రభావాన్ని చూపింది.



## కైలాసం గుట్ట కరెంట్ సమస్యలు వెంటనే పరిష్కరించండి

### - మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేసిన హిందూ ఐక్య వేదిక

కల్వకుర్తి సెప్టెంబర్ 9 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కైలాసం గుట్ట పై కరెంటు స్తంభాలు, వైర్ల దెబ్బ తినడం జరిగిందని, అదేవిధంగా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని త్వరలో బతుకమ్మ నవరాత్రులు దసరా, దీపావళి ఉత్సవాలు రాబోతున్నాయని వాటిని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కి హిందూ ఐక్య వేదిక తరపున వినతి పత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వతంగా ఉండేలా నిర్మించాలని కమిషనర్ ను కోరారు.



## ప్రగతి పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 9

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ విద్యార్థులతో కలిసి కాళోజి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినిలు తెలంగాణ భాష, సంస్కృతి ప్రాముఖ్యతను కవితా రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భాష మన గుర్తింపు, మన గర్వకారణమని, కాళోజి భావజాలం తెలంగాణ ఆత్మకు ప్రతిబింబమని అన్నారు. కార్యక్రమంలో అందరూ తెలంగాణ భాషను గౌరవించుకుంటూ కాపాడుకోవాలని సంకల్పబద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11నుండి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

### సాయుధ పోరాట వారోత్సవాలనుజయప్రదం చేయాలని పిలుపునిచ్చిన పల్లా నరసింహారెడ్డి

దేవరకొండ సెప్టెంబర్ 09 వార్త మిర్రర్ భూమికోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఈనెల 11 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నాడు దేవరకొండ పల్లా పర్వత రెడ్డి భవన్లో జరిగిన నియోజకవర్గ సిపిఐ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో నైజాం కు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతొ లికించదగినదని అన్నారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బిజెపి ప్రభుత్వం హిందూ ముస్లింల మధ్య పోరాటంగా చిత్రీకరించడం విచారకరమని అన్నారు.ఈపోరాటంలో నాలుగువేల అమరవీరుల రక్త తర్పణం చేయడం జరిగిందన్నారు.అదేవిదంగా దొరలు,భూస్వాముల కు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడిదే భూమి అని లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ కె దక్కిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహోత్తరమైన పోరాటాన్ని అవమానపరిచి సాయుధ పోరాట యోధులకు రావలసిన పింఛన్లను ఎత్తివేసిన హీనమైన చరిత్ర ఉందని విమర్శించారు. సెప్టెంబర్ 17 పేరుతో బిజెపి అమరవీరులను స్మరించుకోవడం సిగ్గుచేటని దీని తీవ్రంగా ఖండించారు.తెలంగాణ రైతంగా సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17 వరకు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర



ప్రభుత్వం పై కక్షగట్టి రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. దీని మూలాన వ్యాపారస్తులు కూడా యూరియాను కృత్రిమ కొరతగా సృష్టించి బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల వ్యవసాయానికి సరిపడా యూరియాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు . ఈ నెల 10 వ తేదీ న నల్లగొండ లో జరిగే సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి ఉప్పునూతల వెంకటయ్య అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చి రెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండి మైనోద్దీన్ ఎస్ కనకాచారి దేప సుదర్శన్ రెడ్డి జి వెంకటేశ్వర రెడ్డి కే జయరాములు,బి అచ్చయ్య, బి శైలేష్, ఎన్ రామస్వామి పల్లా రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి సెప్టెంబర్ 09

గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వర్ణోత్సవాల సందర్భంగా ట్రినిటీ హై స్కూల్ లో చౌటుప్పల్ మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల గోడ పత్రికను సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు ఆవిష్కరించారు. అక్టోబర్ 10 నుంచి 13 వరకు ఎల్బీ స్టేడియంలో బాపు బాట, గాంధీజీ లక్ష విగ్రహాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు.. స్వదేశీ మేళా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటి స్వదేశీ మొక్కల పెంపకం, ఖాదీ, చేనేత వస్త్ర ప్రదర్శన, గాంధీజీ ఆచార్య వినోబాభావే సాహిత్యం పుస్తక, చిత్రాల ప్రదర్శన, ఎద్దు గానుగ ప్రదర్శన యోగా, మల్కంబ్ ఆటలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ రేవంత్ రెడ్డి, కేంద్ర రాష్ట్ర మంత్రులను గాందేవాదులను పర్యావరణవేత్తలను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య రాజు సభా అధ్యక్షతన పలు అంశాలు చర్చించి అక్టోబర్లో, ఎల్బీ స్టేడియం నందు జరిగే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించి, ప్రజలంతా ఈ మహోత్సవంలో భాగస్వాములు కావాలని, గాంధీ తత్వాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి నిర్వహించే కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వి బి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, కోశాధికారి డాక్టర్ ఉజ్జిని మంజుల, పోలోజు శ్రీలత, ఉపాధ్యక్షురాలు బొబ్బిలి సంధ్య, వనం మమత, ఎం నీరజ, ఝాన్సీ రాణి, పోలోజు జయశ్రీ, అండాలు, సువర్ణ లక్ష్మి, రమ, అనుష, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# టీ. గౌరారంలో వినాయక శోభాయాత్రలో గ్రామస్తులపై దాడి

### శోభాయాత్రలో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డ దుండగులు

### గ్రామకంఠం భూమికే వేసరు పెట్టిన రాజకీయ పెద్దమనిషి

### ప్రశ్నించిన గ్రామస్తులపై వర్గంతో విచక్షణ రహితంగా దాడి:

డిండి (గుండ్లపల్లి) సెప్టెంబర్ 09 వార్త మిర్రర్::నల్గొండ జిల్లా, డిండి మండలం, టీ. గౌరారం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మూడవత్ రేఖ్య నాయక్ ఆగడాలపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీ.గౌరారం గ్రామ కంఠం భూమిని ఆక్రమించి పట్టా చేయించుకున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు దేవరకొండ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినందుకు కక్ష పెంచుకున్న రేఖ్య నాయక్, వినాయక నిమజ్జనం సందర్భంగా తమపై కర్రలతో దాడి చేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.టీ. గౌరారం కాలనీలోని 407/ఆ సర్వే నంబర్‌లో ఉన్న 33 గుంటల గ్రామ కంఠం భూమిని దేవత్ పల్లి తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మూడవత్ రేఖ్య నాయక్ అక్రమంగా ఆక్రమించి పట్టా చేయించుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు సంతకాలు చేసి రేఖ్య నాయక్ చర్యలను ప్రశ్నిస్తూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.ఈ ఫిర్యాదుతో కక్ష పెంచుకున్న రేఖ్య నాయక్ ఈనెల 5వ తేదీ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో టీ. గౌరారం గ్రామంలో జరుగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్రలో దేవత్ పల్లి తండాకు చెందిన వారి వర్గం మనుషులతో కలిసి గ్రామస్తులపై కర్రలతో దాడికి పాల్పడ్డాడని బాధితులు తెలిపారు. ఈ దాడిలో కొంతమందికి తలలపై, మరికొందరికి ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి.ఈ దాడిలో గాయపడిన వారిలో గ్రామస్తుడు పేర్ల మహేష్ మాట్లాడుతూ, "గ్రామ కంఠం భూమిని ఆక్రమించుకోవడం తప్పు అని ప్రశ్నిస్తే, మాపై విచక్షణారహితంగా దాడి చేశారు అని నాతో పాటు నలుగురు, మహిళలు తీవ్రంగా గాయపడ్డారు" అని వాపోయారు.ఈ ఘటనపై టీ. గౌరారం గ్రామస్తులు డిండి పోలీస్ స్టేషన్‌లో రేఖ్య నాయక్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రేఖ్య నాయక్ ఆగడాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



